కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

పెద్దశంకరంపేట, అక్టోబర్ 24: పెద్దశంకరం పేట మండలంలోని ఆయా గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని తహసీల్దార్ గ్రేసీబాయి అన్నారు. గురువారం కార్యాలయంలో ఐకేపీ, పీఏసీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఐకేపీ ఆధ్వర్యంలో 7, సొసైటీల ఆధ్వర్యంలో 3 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో డీటీ శ్రీనివాస్, ఆర్ఐ శరణప్ప, ఏపీఎం గోపాల్, సీఈవో రవీందర్ న్నారు.

ఓపెన్ గడువు పొడిగింపు

పాపన్నపేట, అక్టోబర్ 24: ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్ష ఫీజ్ చెల్లించేందుకు గడువు పొడిగించినట్లు ఓపెన్ స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ మహేశ్వర్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ రియాజ్ తెలిపారు. రూ.200 ఫైన్‌తో ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. వివరాలకు 9912335581 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ప్లాస్టిక్ అమ్మకం, వాడకం నిషేధం

నర్సాపూర్, అక్టోబర్ 24: ప్లాస్టిక్ అమ్మకం, వినియోగాన్ని పూర్తిగా నిషేధించినట్లు మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావు ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్ 1986 ప్రకారం 120 మైక్రాన్స్ కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ బ్యాగులు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాగులు వినియోగించుట నిషేధించినట్లు తెలిపారు. అమ్మడం, వాడడం చేసిన వారికి రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు జరిమానా విధిస్తామని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అనారోగ్యంతో సీపీఎం నాయకుడు మృతి

సత్యం(ఫైల్)

రామాయంపేట, అక్టోబర్ 24: రామాయంపేట పురపాలిక పరిధిలోని గొల్పర్తి గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు నింగొల్ల సత్యం(55)అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. సత్యం కమ్యూనిస్టు పార్టీలో దశాబ్దాల కాలంగా జిల్లా నాయకుడిగా పనిచేశాడు. సత్యం కుటుంబ సభ్యులను కౌన్సిలర్ మల్యాల కవిత కిషన్, సత్యం తదితరులు పరామర్శించారు.

మట్టి రోడ్డుతో ఇబ్బందులు

మెదక్‌రూరల్, అక్టోబర్ 24: మండలంలోని మాల్కాపూర్ పంచాయతీలో ఉన్న స్కూల్ తండాకు వెళ్లే రహదారి చిత్తడిగా మారింది. దీంతో ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి దారికి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

నేడు పాత్రికేయులకు వర్క్ షాప్

మెదక్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): మెదక్‌లోని కలెక్టరేట్‌లో జర్నలిస్టులకు శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ప్రెస్ ఇన్ఫర్మేషన్ డిప్యూటీ డైరెక్టర్ మానస్ కృష్ణకాంత్ తెలిపారు. జిల్లా పాత్రికేయులు, మీడియాకు ఉదయం హైదరాబాద్‌లో వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, కలెక్టర్ రాహుల్ రాజ్ హాజరవుతున్నట్లు తెలిపారు.

నేడు మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 24: మెదక్ మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం చైర్మన్ చంద్రపాల్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ జానకిరామ్ సాగర్ తెలిపారు. సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

డిజిటల్ క్రాప్ సర్వేతో మెరుగైన ఫలితాలు

రామాయంపేట, అక్టోబర్ 24: డిజిటల్ సర్వేలతో మెరుగైన ఫలితాలు వస్తాయని ఏడీఏ రాజ్‌నారాయణ అన్నారు. గురువారం మండలంలోని రామాయంపేట, చిన్నశంకరంపేట, చేగుంట, నిజాంపేట, నార్సింగి మండలాల్లోని ఆయా గ్రామాల్లో క్లస్టర్ల వారీగా డిజిటల్ సర్వే చేశారు. ఏడీఏ మాట్లాడుతూ సర్వేలతో డివిజన్ వ్యాప్తంగా ఎంత విస్తీర్ణంలో భూమి సాగులో ఉందో తెలుస్తుందన్నారు. భూమి విస్తీర్ణాన్ని బట్టి ఎరువులు, విత్తనాలు తీసుకోవచ్చన్నారు. డివిజన్ వ్యాప్తంగా 14 క్లస్టర్లలో డిజిటల్ సర్వేలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తులకు రిమాండ్

కౌడిపల్లి, అక్టోబర్ 24: గిరిజన మహిళతో పాటు రెండు మేకల మృతికి కారణమైన వ్యక్తులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రంజిత్‌రెడ్డి తెలిపారు. గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని రాజీపేట జాజితండాకు చెందిన కాట్రోత్ శోభతో పాటు రెండు మేకల మృతికి కారణమైన పాతలోత్ శోభ, ఆమె కుమారులు రమేశ్, నరేశ్‌పై కేసు నమోదు చేసి, విచారణ చేపట్టి, వారిని అరెస్ట్ చేసి సిద్దిపేట మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చినట్లు తెలిపారు. పొలానికి కంచె పెట్టినప్పుడు ఏదైనా జరిగితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

షరతుల్లేకుండా బోనస్ చెల్లించాలి

చిలిపిచెడ్: గంగారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

రామాయంపేట: సుతారిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ సిబ్బంది

కౌడిపల్లి: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

- దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దు
- తడిసిన ధాన్యంతో పాటు చివరి గింజ వరకూ ప్రభుత్వమే కొనాలి
- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

కౌడిపల్లి/చిలిపిచెడ్,అక్టోబర్ 24: ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. రైతులు పండించే ప్రతి ధాన్యం గింజ ప్రభుత్వం కొనాలని డిమాండ్ చేశారు. చిలిపిచెడ్ మండల కేంద్రంతో పాటు జగ్గంపేట, గంగారం, అజ్జమర్రి, బండపోతుగల్, ఫైజాబాద్, శీలాంపల్లి, చండూర్, చిట్కుల్‌లో సోమక్కపేట సొసైటీ, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏపీఎం ప్రేమలత, పీఏసీఎస్ ఇన్‌చార్జి చైర్మన్ రాంచంద్రారెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. కౌడిపల్లి మండలంలోని వెంకట్రావుపేట, నాగ్‌సాన్‌పల్లి, సలాబత్‌పూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల దళారులకు ధాన్యాన్ని అమ్మి మోసపోవద్దన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని అమ్మికోవాలన్నారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలో భాగంగా ధాన్యం, మొక్కజొన్నకు ఎలాంటి షరతులు విధించకుండా బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే దళారుల నుంచి రైతులను కాపాడేందుకు మద్దతు ధర ప్రకటించిందన్నారు. తడిసిన ధాన్యంతో పాటు చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నయీముద్దీన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సార రామాగౌడ్, సీడీసీ మాజీ చైర్మన్ దుర్గారెడ్డి, మాజీ ఎంపీపీ రాజునాయక్, వైస్ ఎంపీపీ నవీన్ కుమార్‌గుప్తా, ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, మాజీ సర్పంచ్‌లు ఎల్లం, చంద్రశేఖర్ గుప్తా, ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ ఆంజనేయులు, ఐకేపీ ఏపీఎం సంగమేశ్వర్, ఆర్ఐ శ్రీహరి, పీఏసీఎస్ సీఈవో పోచయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, మండల రైతుబంధు మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, గంగాధర్, మండల యూత్ మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ కిషన్‌రెడ్డి తదితరలు పాల్గొన్నారు. బండపోతుగల్ తాజా మాజీ సర్పంచ్ ఇస్తారి అనారోగ్యంతో ఉండడంతో ఎమ్మెల్యే ఆయన ఇంటి వెళ్లి పరామర్శించారు.

రామాయంపేట సుతారిపల్లిలో

రామాయంపేట, అక్టోబర్ 24: మండలంలోని సుతారిపల్లిలో సొసైటీ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ రాగి సంధ్య, కార్యదర్శి జ్యోతి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.

నిజాంపేటలో..

నిజాంపేట,అక్టోబర్24: మండలంలోని నందగోకుల్, నగరం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను రామాయంపేట పీఏసీఎస్ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి ప్రారంభించారు.

అల్లాదుర్గంలో..

అల్లాదుర్గం, అక్టోబర్ 24: అల్లాదుర్గం మండలంలోని సీతానగర్, అప్పాజిపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ మల్లేశం ప్రారంభించారు.

చిన్నశంకరంపేటలో..

చిన్నశంకరంపేట, అక్టోబర్24: మండలంలోని చందంపేట సొసైటీ ఆధ్వర్యంలో ధర్పల్లి, సూరారం, భాగీర్తిపల్లి, చందంపేట, రుద్రారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సొసైటీ చైర్మన్ సత్యనారాయణ ప్రారంభించారు.

నిజాంపేట: నందగోకుల్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి

చిన్నశంకరంపేట: ధర్పల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్ సత్యనారాయణ

అల్లాదుర్గం: కాయిదంపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ మల్లేశం

ప్రొటోకాల్ ఉల్లంఘిస్తారా?

- ఎమ్మెల్యే వచ్చేవరకు ఆపాలని బీఆర్ఎస్.. ఆగేదే లేదన్న కాంగ్రెస్ నాయకులు
- కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి
- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్, మాజీ ఎంపీపీ హరికృష్ణ

కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల వాగ్వాదం

శివ్వంపేట, అక్టోబర్ 24: శివ్వంపేటలో సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఉదయం 11.30 గంటలకు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ప్రారంభించాల్సి ఉంది. ఎమ్మెల్యే లేకుండానే పీఏసీఎస్ చైర్మన్ వెంకటరామిరెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు ప్రారంభించడానికి ప్రయత్నించారు. ఎమ్మెల్యే వచ్చేవరకు ఆపాలని బీఆర్ఎస్ నాయకులు అడ్డుకున్నారు. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదానికి దిగారు. కోపోద్రకులైన బీఆర్ఎస్ నాయకులు, పలువురు పీఏసీఎస్ డైరెక్టర్లు రిబ్బన్ కట్ చేయడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తతకు దారితీసింది. హుటాహుటిన ఎస్సై మహిపాల్‌రెడ్డి తన సిబ్బందితో వచ్చి ఇరువర్గాలకు నచ్చజెప్పి సముదాయించారు.

అరగంట ఆలస్యమైతే..

ధాన్యం కొనుగోలు కేంద్రానికి ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి రావడానికి అరగంట ఆలస్యమైతే ప్రొటోకాల్ ఉల్లంఘించి పీఏసీఎస్ చైర్మన్ ఎలా ప్రారంభిస్తారని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ ప్రశ్నించారు. రత్నాపూర్‌లో విలేకరులతో వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో మంత్రి పర్యటన కోసం 2గంటలు ఎమ్మెల్యే ఆగారని, కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేను అగౌరవపరిచేందుకు ప్రొటోకాల్ ఉల్లంఘించి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎలా ప్రారంభిస్తారని మండిపడ్డారు. దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్న పీఏసీఎస్ చైర్మన్ వెంకటరాంరెడ్డి పద్ధతి మార్చుకోవాలన్నారు. ప్రొటోకాల్ ఉల్లంఘిస్తే అడుగడుగునా అడ్డుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఆత్మకమిటీ మాజీ చైర్మన్ గొర్రె వెంకట్‌రెడ్డి, నాయకులు యాదాగౌడ్, వేమారెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు బొగ్గుల శ్రీనివాస్, బొగ్గుల యాదగిరి, కుమ్మరి శంకర్, బొల్లు యాదయ్య, దొడ్ల ఆంజనేయులు, చెర్విరాల అశోక్‌గుప్తా, చెప్యాల బాలేశ్, బొగ్గుల విజయ్ ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పెద్దశంకరంపేటలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శంకర్

రేగోడ్, అక్టోబర్ 24: ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి ఆదేశానుసారం మండలంలోని లింగంపల్లి గ్రామంలో సైబర్ నేరాలపై ఎస్సై పోచయ్య గురువారం అవగాహన కల్పించారు. పరిచయం లేని వ్యక్తులు ఫోన్ కాల్ చేస్తే బ్యాంకు అకౌంట్, ఏటీఎం, ఓటీపీ వివరాలు చెప్పవద్దన్నారు. ఆన్‌లైన్ బెట్టింగులకు దూరంగా ఉండాలన్నారు. ఏఎస్సై మల్లయ్య, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అవగాహన కలిగి ఉండాలి

పెద్దశంకరంపేట, అక్టోబర్ 24: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శంకర్ అన్నారు. గురువారం పెద్దశంకరంపేటలోని నాందేడ్ అకోలా జాతీయ రహదారిపై సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తులు మెసెజ్ చేసి ఓటీపీ చెప్పమంటే చెప్పొద్దన్నారు. ఆయనతో ఏఎస్ఐ విఠల్, సిబ్బంది తదితరులున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

నాగరాజు (ఫైల్)

రామాయంపేట, అక్టోబర్ 24: విద్యుదాఘాతంతో రైతు పొలంలోనే మృతి చెందిన ఘటన రామాయంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఝాన్సీలింగాపూర్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. చాకలి నాగరాజు గురువారం తెల్లవారుజామునే తన పొలం వద్దకు వెళ్లి మోటర్ ఆన్ చేస్తుండగా, చేతికి విద్యుత్ కేబుల్ తగలడంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. పొలం వద్దకు వెళ్లిన వ్యక్తి పది గంటలైనా రాకపోవడంతో కుటుంబీకులు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్సై బాలరాజు ఘటనా స్థలానికి వెళ్లి పంచనామా నిర్వహించి, బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసును దర్యాప్తులో ఉంది.

30న రాష్ట్ర బీసీ కమిషన్ బృందం పర్యటన

- కలెక్టర్ రాహుల్‌రాజ్

కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర బీసీ కమిషన్ బృందం ఈ నెల 30న ఉమ్మడి మెదక్ జిల్లా పర్యటనకు రానున్నట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. కమిషన్ చైర్మన్ నిరంజన్ హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో గురువారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి, పర్యటన వివరాలు వెల్లడించారు. ఉమ్మడి మెదక్ జిల్లాకు సంబంధించిన అభిప్రాయ సేకరణ ఈనెల 30న సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఉంటుందన్నారు. చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి, బీసీ వెల్ఫేర్ కమిషనర్‌తో కూడిన బృందం ప్రజాభిప్రాయాలు స్వీకరించనున్నదని తెలిపారు. మెదక్, సిద్దిపేట్. సంగారెడ్డి జిల్లాలకు చెందిన రాజకీయ పార్టీలు, బీసీ సంఘాల ప్రతినిధులు తమ అభిప్రాయాలను కమిషన్‌కు తెలుపవచ్చన్నారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, బీసీ అభివృద్ధి అధికారి నాగరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలి

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 24: భూముల క్రమబద్ధీకరణకు జిల్లాలో దాఖలైన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియకు పురోగతిపై మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు, వార్డు అధికారులతో గురువారం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ స్థాయిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ వేగవంతం కావాలన్నారు. ఎల్ఆర్ఎస్‌పై పూర్తి అవగాహనతో పాటు మున్సిపల్‌కు ఇచ్చిన యాక్షన్ ప్లాన్ ప్రకారం ఎల్ఆర్ఎస్ ప్రక్రియ జరగాలని, వార్డుల వారీగా ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, క్షేత్రస్థాయి పరిశీలన, తదితర పూర్తి వివరాలు కలిగి ఉండాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు ప్రతి రోజు టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఎన్ని దరఖాస్తులకు పరిష్కరించాలో తెలుపాలన్నారు. సమావేశంలో ఈడీఎం సందీప్, మహేందర్ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి: ఎస్పీ

ఆయుధాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్,అక్టోబర్24: విద్యార్థులు ఇష్టంతో చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో కష్టపడి పోరాడితే సాధించనిది ఏదీలేదన్నారు. అనంతరం పోలీసులు ఉపయోగిస్తున్న ఆయుధాలు ఏకే 47, ఎస్ఎల్ఆర్ కార్బన్, 9ఎంఎం పిస్టల్, బీడి టీమ్, డాగ్‌స్క్వాడ్స్ గురించి సంబంధిత అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్, సాయుధ దళ డీఎస్పీ రంగనాయక్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలి: డీఈవో



రామాయంపేట, అక్టోబర్ 24: విద్యార్థుల్లో మార్పులు తీసుకురావడానికి, విద్యావ్యవస్థను పటిష్టం చేయడంతో పాటు విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలని డీఈవో రాధాకిషన్ అన్నారు. గురువారం రామాయంపేట మండలం లక్ష్మాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో చదువడం, రాయడం చేయించారు. మధ్యాహ్న భోజనం, వంట గదులను పరిశీలించి, వంట మనుషుల వివరాలడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెను ప్రకారం భోజనం పెట్టాలని సూచించారు. డీఈవో వెంట ఏఎంవో సుదర్శనమూర్తి, హెచ్ఎం నర్సాగౌడ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

కేసీఆర్ చొరవతోనే మెడికల్ కళాశాల

విలేకరులతో మాట్లాడుతున్న మల్లికార్జున్‌గౌడ్

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 24: కేసీఆర్ ప్రత్యేక చొరవతోనే మెదక్‌కు మెడికల్ కళాశాల వచ్చిందని మున్సిపల్ వైస్‌చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్ అన్నారు. గురువారం మున్సిపల్ కౌన్సిలర్ కృష్ణారెడ్డి, ఆర్‌కె శ్రీనివాస్, కిశోర్, జయరాజ్, బీఆర్ఎస్ నాయకులు ప్రభురెడ్డి, రంజిత్‌నాయక్, శ్రీనునాయక్, దశరథ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పిల్లికోటాల్‌లోని మాతశిశు సంరక్షణ కేంద్రం వెనకాల గల భూమి మెడికల్ కళాశాలకు కేటాయించినట్లు తెలిపారు. జీవో 84 ద్వారా 2023 జూలై 5న అప్పటి వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు భూమి పూజ చేశారన్నారు. వంద సీట్లతో 2023-24 విద్యాసంవత్సరానికి కళాశాల ప్రారంభించాలని జీవోలో పేర్కొన్నారన్నారు. నేడు 50 సీట్లతో ప్రారంభించడం దురదృష్టమన్నారు. వంద సీట్లకు పెంచాలని మల్లికార్జున్ డిమాండ్ చేశారు. కళాశాల కోసం మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి చాలా కృషి చేశారన్నారు. జిల్లాకో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలన్నది కేసీఆర్ సంకల్పమన్నారు.

ఫెన్సింగ్ పోటీలకు ఐదుగురు ఎంపిక

ఫెన్సింగ్ పోటీలకు జిల్లా నుంచి ఎంపికైన క్రీడాకారులు

చేగుంట, అక్టోబర్ 24: ఆలిండియా యూనివర్సిటీ ఫెన్సింగ్ పోటీలకు జిల్లా నుంచి ఐదుగురు ఎంపికైనట్లు కోచ్ కరణం గణేశ్ రవికుమార్ గురువారం తెలిపారు. కూకట్‌పల్లిలోని ఎన్టీయూలో కాలేజీ ఇండోర్ స్టేడియంలో జరిగిన యూనివర్సిటీ ఫెన్సింగ్ పోటీల్లో జిల్లానుంచి ఫాయిల్ విభాగంలో దుండిగల్‌లోని ఐఏఆర్ ఈ కాలేజీలో బీటెక్ (సీఎస్సీ) థర్డ్ ఇయర్ చదువుతున్న కరణం నిశాంత్, కొంపల్లిలోని సీఎంఆర్‌లో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న ముఖేశ్, దుండిగల్ (ఎంఎల్ఆర్ఐటీ) ట్రిపుల్‌ఈ రెండో సంవత్సరం చదువుతున్న శ్రీశాంత్ ఈపీ విభాగంలో, నర్సాపూర్ బీవీఆర్‌టీలో మూడో సంవత్సరంలో చదువుతున్న జవాదుద్దీన్ సాబేర్, కొంపల్లి సీఎంఆర్ బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న రాజేశ్వరి ఈపీ విభాగంలో ఎంపికయ్యారు. వీరు నవంబర్ 6 నుంచి 10వ తేదీ వరకు జమ్ములోని యూనివర్సిటీ ఆఫ్ జమ్ము ఇండోర్ స్టేడియంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని గణేశ్‌రవికుమార్ తెలిపారు.

జాతీయస్థాయి ఫుట్‌బాల్ శిక్షణకు నలుగురు ఎంపిక

జాతీయస్థాయి శిక్షణ శిబిరానికి ఎంపికైన క్రీడాకారులు

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 24: జాతీయస్థాయి ఫుట్‌బాల్ శిక్షణకు ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు కార్యదర్శి నాగరాజు తెలిపారు. గురువారం మెదక్‌లోని అవుట్‌డోర్ స్టేడియంలో సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుల ఎంపికలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా నుంచి 120 మంది క్రీడాకారులు పాల్గొనగా, ప్రతిభ కనబర్చిన అరుణ్ దినాకరన్, శ్రీకాంత్, ఎండీ సాదీ, ఎం.జాన్‌పాల్ ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 25 నుంచి 30వ తేదీ వరకు హైదరాబాద్‌లోని జింఖానా గ్రౌండ్‌లో జాతీయస్థాయి శిక్షణా శిబిరంలో వారు పాల్గొంటారన్నారు. ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి, సెలక్షన్ కమిటీ సభ్యుడు నగేశ్, మెదక్ అకాడమీ అధ్యక్ష కార్యదర్శులు వంశీ, వినయ్, కోచ్ ప్రకాశ్ పాల్గొన్నారు.

బీవీఆర్ఐటీలో రక్తదాన శిబిరం

రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ సంజయ్ దూబే, డైరెక్టర్ లక్ష్మీప్రసాద్

నర్సాపూర్, అక్టోబర్ 24: నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ కళాశాలలో ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరాన్ని ప్రిన్సిపాల్ సంజయ్ దూబే ప్రారంభించారు. డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, ఎస్వీఈఎస్ డైరెక్టర్ రవీంద్రబాబు, ఐటీ విభాగం హెచ్‌వోడీ దశరథరామయ్య,సందీప్ పాల్గొన్నారు. శిబిరంలో 250 మందికి పైగా రక్తదానం చేశారు.

యువకుడి దారుణహత్య

చిన్నశంకరంపేట, అక్టోబర్ 24: దవాఖాన ఆవరణలో గుర్తు తెలియని యువకుడిని బండరాయితో కొట్టి కిరాతకంగా హత్య చేసి, మృతదేహాన్ని గుర్తుపట్టకుండా కాల్చేసిన ఘటన చిన్నశంకరంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని పీహెచ్‌సీని తెరవడానికి వైద్య సిబ్బందితో పాటు డాక్టర్ సాయిసింధు వచ్చారు. దవాఖాన వెనకాల ఉన్న డోర్‌ను తెరవగానే ముందు ఓ యువకుడి మృతదేహం కనిపించింది. దీంతో ఆందోళనకు గురైన వైద్య సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై నారాయణ ఘటనా స్థలానికి చేరుకుని దవాఖానలోకి తీసుకొచ్చి పరీక్షించగా, యువకుడిని దుండగులు బండరాయితో కిరాతంగా కొట్టి హత్య చేసినట్లు తేలింది. అనంతరం మృతదేహాన్ని చెత్తతో పాటు ప్లాస్టిక్ టీగార్డెన్ వేసి తగలబెట్టి మృతదేహాన్ని గుర్తు పట్టకుండా చేశారు. తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, రామాయంపేట సీఐ వెంకట్‌రాజాగౌడ్ ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మెదక్ నుంచి క్లూస్ టీంను రప్పించారు. సీసీ ఫుటేజ్‌ను పరిశీలించి నిందితులను పట్టుకుంటామని తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి తెలిపారు. డాక్టర్ సాయిసింధు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ట్రైనీ అధికారుల ఇంటింటి సర్వే

ఇంటింటి సర్వే చేస్తున్న ట్రైనీ అధికారులు

రామాయంపేట, అక్టోబర్ 24: మండలంలోని డీ.ధర్మారంలో ట్రైనీ ఐఏఎస్ అధికారులు గురువారం ఇంటింటి సర్వే చేపట్టి, సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. డంపుయార్డుకు వెళ్లి చెత్తను పరిశీలించి తడి పొడి చెత్తపై వివరాలు తెలుసుకున్నారు. శ్మశాన వాటికకు వెళ్లి పరిసరాలను పరిశీలించారు. అంగన్ వాడీ కేంద్రంలో చిన్నారులను తూకం వేశారు. వారితో రామాయంపేట ఎంపీడీవో షాజులుద్దీన్, ఏపీవో శంకర్, కార్యదర్శి మహేందర్ ఉన్నారు.

50 పడకల దవాఖాన మంజూరు చేయాలి

చిలిపిచెడ్,అక్టోబర్ 24: మండలానికి 50 పడకల దవాఖాన మంజూరు చేయాలని జిల్లా కేంద్రానికి వచ్చిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహకు బీజేపీ మండల నాయకులు వినతి పత్రం అంజేశారు. గురువారం మెదక్‌కు మంత్రి రావడంతో బీజేపీ మాజీ మండలాధ్యక్షుడు దశరథ్, మండల ప్రధాన కార్యదర్శి ముకుంద సంతోష్‌కుమార్ సమస్యలు తెలిపారు. సానుకులంగా స్పందించిన మంత్రి త్వరలో దవాఖాన మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. బీజేపీ నాయకులు ఆంజనేయులు గౌడ్, సాయికుమార్ పాల్గొన్నారు.